# ప్రజల డబ్బు

అది వరంగల్‌కు చాలా దగ్గరల్లో వుండే ఓ టౌన్. సోమయ్య ఉదయం పదకొండింటికి ఆ ఊరి మెయిన్‌రోడ్‌లో వున్న ఆంధ్రాబాంక్ ముందు నిల్చొని ఆ బ్యాంకుకు వచ్చీపోయే జనాన్ని పరిశీలిస్తున్నాడు.

సోమయ్యకు ఇరవయ్యేళ్ళుంటాయి. పొట్టిగా, నల్లగా ఉంటాడు. అతని తల మీది వెంట్రుకలు ఎప్పుడూ నిటారుగా వుంటాయి. చిన్న నుదురు, చిన్న కళ్ళు, వెడల్పుగా వుండే ముక్కుపుటాలు, లావుగా వుండే పెదవులు, ఎప్పుడూ సిగరెట్టో, బీడో ఆ పెదవుల మధ్య వెలుగుతూ ఉంటుంది. పాంట్, బుషర్ట్ వేసుకొని సిగరెట్ పీలుస్తూ నిల్చున్న అతన్ని చూసిన వాళ్ళెవరైనా 'కాలేజి స్టూడెంట్ కావచ్చు' అనుకుంటారు.

ఎవడి చేతిలో చూసినా డబ్బు... ఎవడి జేబులో చూసినా నోట్ల కట్టలు... ఎవడి బ్యాగ్‌లో చూసినా వేలు, లక్షలు... ఇంత మంది దగ్గర డబ్బున్నాక తన దగ్గర్నే ఎందుకు లేదు? తన తల్లిదండ్రులు కూలి నాలి చేసుకొని బతికేటోళ్ళు. భూములు, బంగ్లాలు లేనోళ్ళు. ఉన్నోళ్ళ దోపిడికి గురవుతున్నోళ్ళు. తనను కూడా వాళ్ళలాగే కూలినాలి చేసుకొని బతకమన్నారు. తను కూలి నాలి చెయ్యనన్నడు. ఉన్నోడి దగ్గర బానిసగా పడుండనన్నడు. చదువుకుంటనని పట్టుబట్టి గీ టౌన్ కొచ్చిండు. ఊళ్ళోనే యేడో తరగతి దాకా చదివి ఎనిమిదో తరగతికి తనూరి యితర స్టూడెంట్లతో బాటే ఈ టౌన్ కొచ్చి హాస్టళ్ళో జాయినయ్యిండు. అయినా తనకు చదువబ్బలేదు. టెన్త్ దాకా నకలు కొట్టి ప్యాసయిండు. ఇంటర్‌ల నకలు కొట్టబోయి పట్టుబడ్డడు. గంతే! తన చదువాగిపోయింది.

తనకు యింటికెళ్ళి కూలి పనిచెయ్యడం ఇష్టం లేదు. ఎలాగైనా టౌన్‌లోనే వుండిపొయ్యి యేదన్నా పని చూసుకోవాలె. రెండు మూడు చోట్ల చిన్న చిన్న పనులు చేసిండు. కొద్ది రోజులు ఓ స్కూటర్ మెకానిక్ దగ్గర చేరిండు. కొంచెం మెకానిజమ్ కూడా నేర్చుకున్నడు. ఒక రోజు ఓ కస్టమర్ స్కూటర్ బ్యాగ్‌లో వున్న కాష్ బ్యాగ్‌ను కొట్టేయబోయి పట్టుబడ్డడు. ఆ మెకానిక్ తనను పన్లోంచి తీసేసిండు.

కొద్ది రోజులు ఓ పిండి గిర్నీలో పనిచేసిండు. కానీ ఆ పనంటే తనకు రోత పుట్టింది. మిరపకాయలు పట్టేటప్పుడు ఆ ఘాటుకు తల తిరిగిపోయేది. రెండ్రోజుల కిందనే మానేసిండు. తనూరి స్టూడెంట్లు వుండే చోటికి బోతే వాళ్ళే యింత తిండి పెడ్తున్నరు. రాత్రి వాళ్ళింట్లో పండుకోనిస్తున్నరు. కానీ ఈ రోజు వాళ్ళు తనను వాళ్ళింటికి రావొద్దని చెప్పేసిండ్రు. ఇక ఇవ్వాల్టి నుంచి తన బతుకు ఫుట్‌పాత్‌మీదనే....

బ్యాంక్ ముందు నిల్చుంటే తెలిసిన మొఖమేదన్నా కనిపించకపోతదా... ఓ పది అప్పు పుట్టకపోతదా అనుకున్నాడు.

"యేందిరా సోములు! గిక్కడ నిల్చొనేమో అందర్నీ దొంగోలె చూస్తున్నవు? ఎవడి దగ్గర్నన్న పర్స్ కొట్టేద్దామనా?" అన్నాడు అప్పుడే అక్కడకు స్కూటర్ మీదొచ్చిన చంద్రయ్య... సోమయ్య భుజం మీద చెయ్యేసి.

"యేందిరా చంద్రూ! నువ్వా?! బ్యాంకుల డబ్బులు జమ జేస్తనని వచ్చినవా యేంది?" అన్నాడు సోమయ్య.

"ఔన్నా! మా సేటు పంపించిండు. నిన్నటి కలెక్షన్ పదివేలు బాంక్‌లేసి రమ్మన్నడు. నేనిప్పుడు రమణయ్య సేటు దగ్గర... ఆయన సినిమా టాకీసుల పనిచేస్తున్న".

"అరె చంద్రూ! నాక్కూడ మీ సేటు దగ్గర యేదన్న పనిప్పించరాదుర".

"నీకిదివరకిప్పించిన పన్లు మహాజేసినవని నీకు మళ్ళిప్పిస్త. నువ్వేం పని చేస్తవుర. మనూళ్ళెకు బోయి చప్పుడు జేక కూలి నాలి జేసుకో... గిప్పుడు కూలి రేట్లు మస్తుపెరిగినయ్. రోజుకు యాబైదాకా యిస్తండ్రు."

"గా కూలి పనినాతోని గాదే... పనిప్పించకుంటె బాయెగని ఓ పది రూపాయలు నా మొఖాన బారెయ్"

"పది లెవ్వు... ఐదు లెవ్వు. మా సేటు ఒక్కపైస కూడా ఎక్కువియ్యడు. నీ లెక్క నేను దొంగతనం జేసెటోన్ని కాను" అంటూ చంద్రయ్య తన చేతిలో వున్న మనీ బ్యాగ్‌ను ఇంకాస్త గట్టిగా పట్టుకొని బ్యాంక్ లోపలికి వెళ్ళబోయాడు.

"చంద్రన్నా! దండం పెడ్తనే... ఓ ఐదన్నా యియ్యి. పొద్దట్నించీ టీ నీళ్ళన్నా తాగలేదు." సోమయ్య చంద్రయ్య చెయ్యి పట్టుకొని బతిమిలాడాడు.

"అరే సోములూ! నీకో ఉపాయం చెప్పనారా?!"

"యేం ఉపాయం చెప్పుతవే?"

"ఈ రోజు పేపర్ జూసినవా? నీ మొఖానికో పేపర్ గూడనా గని... అన్నలమని చెప్పుకొని లక్షలు లక్షలు చందాలు వసూలు జేస్తున్నరట. నువ్వు గూడ గా పని జెయ్యి. ఈ చుట్టు పక్కల అన్నల పేరు చెబితే చాలు- డబ్బున్న పతొక్కడూ ఎంతంటే అంతిస్తరు. గట్ల కొంతకాలం బతుకు. పోలీసులు పట్టుకుంటే జైలుకుపో. జైళ్ళగింత తిండైతే బెద్దరు గద! నీ అసుంటి యేం చేతగానోనికి గీ పనిబెస్ట్" అంటూ చంద్రయ్య బ్యాంక్ లోపలికెళ్ళిపోయాడు. సోమయ్య అక్కడే నిల్చొని చంద్రయ్య అన్న మాటల్ని గూర్చి ఆలోచించాడు. అతని బుర్ర చాలా చురుగ్గా పనిచేసింది.

వ్యంగ్యంగా చెప్పినా చంద్రయ్య మాటలల్ల నిజం వుంది. ఈ చుట్టుపక్కల అన్నలంటే హడల్. డబ్బులున్నోళ్ళంతా అన్నల పేరు చెప్తే చాలు, ఎంతడిగితే అంతిస్తరు. కొంచెం తెలివిగా, జాగ్రత్తగా వుంటే తను పోలీసులక్కూడా పట్టుబడడు. ఈ పని తనొక్కడే చెయ్యాలె. ఎవర్ని కలుపుకున్నా ప్రమాదమే.

... .... ...

అది వరంగల్ సిటీలోని సిద్ధార్థనగర్. ఇక్కడందరూ డబ్బునోళ్ళే వుంటారు. పెద్ద పెద్ద బంగ్లాలు, బంగ్లా ముందు పెద్ద పెద్ద అశోక చెట్లు... యే యింటి పోర్టికో కింద చూసినా తళతళ మెరుస్తున్న మారుతీ కార్లు... అందరూ పెద్ద పెద్ద ఉద్యోగస్తులు... డాక్టర్లు... ఇంజనీర్లు... యే ఇంట్లో చూసినా కట్టలకు కట్టలు కరెన్సీ నోట్లు మూల్గుతుంటాయి. అంతా పాపపు సొమ్మే. యిందులో కష్టపడి సంపాయించిన వాడెవ్వడున్నాడు? ఈ సొమ్మును దోచుకుపోతే తప్పేంలేదు.

అప్పుడే చీకటి పడ్తోంది. జన సంచారం ఎక్కువగా లేదు. సోమయ్య ఓ బిల్డింగ్ ముందు నిల్చున్నాడు. తన ప్లాన్‌ను అమలు చెయ్యడానికిది బెస్ట్ ప్లేస్. ఈ యింటికి చుట్టుపక్కల కొంత దూరం వరకు వేరే యిళ్ళు లేవు.

ఇంటి ముందు బోర్డు చూశాడు. 'కె.కామేశ్వరరావు, మేనేజర్, కెనెరా బ్యాంక్' అని వుంది. ఇంటి ముందు పోర్టికో కింద తెల్లగా మెరుస్తున్న మారుతీ కారు పార్క్ చెయ్యబడి వుంది.

సోమయ్య గేటు తెరుచుకుని లోపల కొచ్చాడు. ఇంట్లో వాతావరణం ప్రశాంతంగా వుంది. సడీ చప్పుడూ లేదు. అసలు యింట్లో ఎవరన్నా వున్నారా? అన్న సందేహం కూడా కల్గింది.

సోమయ్య కాలింగ్ బెల్ నొక్కాడు. లోపల బెల్ మోగిన చప్పుడు వినిపించింది. రెండు నిముషాల తర్వాత తలుపులు తెరుచుకున్నాయి.

"ఎవరు కావాలి బాబూ?" అంటూ ఓ అరవయ్యేళ్ళ పెద్ద మనిషి బయటకొచ్చాడు. తలంతా నెరసివుంది. లుంగీ, బనియన్ వేసుకున్నాడు. చాలా దళసరిగావున్న కళ్ళద్దాలు, చేతిలో పేపర్.

"కామేశ్వరరావు లేడా?" అడిగాడు సోమయ్య సాధికారికంగా.

"లేడు బాబూ... కొడుకు, కోడలు కలిసి నిన్ననే మద్రాసు వెళ్ళారు. వారం రోజుల దాకా రారు" అన్నాడు పెద్ద మనిషి.

"ఫర్వాలేదు... అయితే నీ తోనే మాట్లాడత"

"యేమిటో చెప్పుబాబు"

"జాగ్రత్తగా విను. నన్ను అన్నలు పంపించిండ్రు"

"అన్నలా? అన్నలంటే?"

"వరంగళ్ళ వుంటున్నవు... నీకు అన్నలంటే తెలవదురా బాడుకావ్ః!" గద్దించినట్టుగా అన్నాడు సోమయ్య.

"ఆఁఆఁ... తెలుసు.. తెలుసు" ముసలాయన వణికిపోతూ అన్నాడు.

"కిష్టాపురం అడివిల వారం రోజుల తర్వాత పెద్ద మీటింగుంది. అరేంజిమెంట్లు జేస్తున్నము. చందాలు వసూలు జేస్తున్నము. కామేశ్వరరావు దగ్గర పదివేలు పట్టుకురమ్మని నన్నుపంపించిండ్రు".

"పదివేలా?" ముసలాయన నోరు తెరిచాడు.

"ఔన్రా! పదివేలే... మీకు పదివేలు ఓ లెక్కా? తొందరగా యిస్తవా? లేదా? మా మీద పోలీసుల నిఘా వుంటది. నేను జల్దీపోవాలె..."

"కానీ.... కానీ... నా దగ్గర పదివేలు లేవు బాబు"

"పదివేలు లేవా? పదివేలంటే మీ కారుకో నెల రోజుల పెట్రోలు ఖర్చు కూడా కాదు... తొందరగా తెస్తవా... నీ కారును ఈ బాంబుతో పేల్చేయ్యమంటవా?" అంటూనే సోమయ్య తన చేతిలో వున్న సంచీలోంచి ఓ బాంబులాంటి వస్తువును తీయబోయాడు.

"వద్దు బాబు.. వద్దు... మేం నువ్వనుకున్నంత డబ్బున్న వాళ్ళం కాదు. కారును లోన్ మీద తీసుకున్నాము. ఇప్పటికిప్పుడు పదివేలంటే ఎక్కడ్నించి తెమ్మంటావు బాబు. ఓ ఐదు వందలో... ఆరు వందలో అంటే.."

"ఎంతుంటే అంత... జల్దీ తేపో... ఆలస్యం జేసినవంటే పోలీసులొస్తరు. నాకూ వాళ్ళకు యుద్ధమైతది... నేను వాళ్ళ మీదికి బాంబు విసురత.... నీ యిల్లు బ్లాస్టయిపోతది...."

"వద్దు బాబు... యే బాంబులూ విసరొద్దు... నేను ఇప్పుడే వస్త...." అంటూ ముసలాయన లోపలికెళ్ళి మూడు నిమిషాల్లో తిరిగొచ్చాడు.

"తొమ్మిది వందల యాభై రూపాయలున్నాయి బాబు... కరెంటు బిల్లు కట్టమని వాడిచ్చిపోయాడు. ఈ రోజు నాకు వెళ్ళడానికి చేతకాలేదు. ఆ డబ్బు అలాగే వుండిపోయింది. లేకపోతే యిది కూడా వుండేది కాదు" అన్నాడు.

సోమయ్య వెంటనే అతని చేతుల్లోంచి నోట్ల కట్టను లాక్కొని తన సంచీలో వేసుకున్నాడు.

"తలుపులేసుకో... పోలీసులకు చెప్పినా, ఫోన్ చేసినా నీ యిల్లు మొత్తం బ్లాస్టయిపోతది... జాగ్రత్త."

"చచ్చినా పోలీసులకు చెప్పను బాబు!" అన్నాడు ముసలాయన.

సోమయ్య మరు క్షణంలో బయటకొచ్చేసి వేగంగా నడవడం మొదలెట్టాడు. ముసలోడింత తొందరగా దారి కొస్తడనుకోలేదు. కన్ను మూసి తెరిచేంతలో తన చేతిలో తొమ్మిది వందల యాభై రూపాయలు... గ్రేట్!

ఆ రెండో రోజు సోమయ్య మరో కాలనీకెళ్ళాడు. ఓ మూడంతస్తుల బంగళా చూసి అదో పెద్ద బిజినెస్ మ్యాన్‌దని తెలుసుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఆ యింట్లో ప్రవేశించాడు. అప్పుడా యింట్లో ఆడవాళ్ళు తప్ప మగవాళ్ళెవరూ లేరు.

ఇంట్లో ప్రవేశిస్తూనే "అగ్రవాల్ సాబ్ లేడా?" అన్నాడు.

"లేదు... షాపుకెళ్ళిండు" అంది అగ్రవాల్ భార్య ఇతడు ఎవరై వుంటాడా అని ఊహించడానికి ప్రయత్నిస్తూ...

"నన్ను అన్నలు పంపించిండ్రు... ఎల్లుండి మీటింగుంది. వెయ్యిమందొస్తరు. వాళ్ళకు భోజనాలు పెట్టాలె. అగ్రవాల్ సాబ్ దగ్గర ఓ పదివేలు పట్టుకురమ్మన్నరు" అన్నాడు సోమయ్య.

"మాకు యేమి తెల్వదు... సేట్ వచ్చినంకరా" అందామె కొంచెం భయపడ్తూనే.

"నేను మళ్ళొస్తననుకున్నవా? గిప్పుడే ఎంతో కష్టంగా పోలీసులను తప్పించుకోనొచ్చిన. మళ్ళొస్తె మసే! ఎంతుంటే అంత మర్యాదగిచ్చెయ్... లేకుంటే..." అంటూనే సోమయ్య సంచీలోంచి ఓ పిస్టల్ లాంటి వస్తువును తీసి అక్కడే నిల్చున్న అగ్రవాల్ కొడుక్కు గురి పెట్టాడు.

"వద్దు.... వద్దు.... నా కొడుకునేం చెయ్యొద్దు... డబ్బు తెస్త... పదిలెవ్వు... ఐదున్నట్టున్నయ్" అగ్రవాల్ భార్య వణికిపోతూ అంది.

"జల్దీతేపో... నువ్వు తెచ్చేంత వరకు నీ కొడుకు ప్రాణాలు నా చేతులుంటయ్" అన్నాడు సోమయ్య పిస్టల్‌ను ఆ ఐదేళ్ళ పసివాడి మీదకు అలాగే గురిపెట్టి.

ఆమె లోపలకు పరిగెత్తి మరుక్షణంలో ఐదువేల రూపాయల కట్టతో బయటకొచ్చి సోమయ్య చేతికా డబ్బిచ్చింది.

"తలుపు వేసుకో... నేనొచ్చినట్టు పోలీసులతో చెప్పావో... నీ కొడుకు ప్రాణాలు దక్కవు" అంటూనే సోమయ్య బయటకొచ్చేశాడు.

... ... ...

మూడేళ్ళ తర్వాత విజయనగరంలోని ఓ మారు మూల వాడలో "సోమేశ్వర చిట్‌ఫండ్స్ అండ్ ఫైనాన్సియర్స్" అనే పేరుతో ఓ ఆఫీసుకు ప్రారంభోత్సవం జరిగింది. సోమయ్య సోమేశ్వర్‌గా మారాడు. చాలా డబ్బున్న వాళ్ళ అమ్మాయితో అతనికి పెళ్ళి జరిగింది.

సోమయ్య ప్రారంభించిన ఆ కంపెనీ చాలా త్వరలోనే పెద్ద లాభాల్ని ఆర్జించటం మొదలెట్టింది. అతని వ్యాపారం యింకా విస్తరించింది. త్వరలోనే అతడో పెద్ద బట్టల షాపు కూడా ప్రారంభించాడు. అతడు పట్టుకున్నదల్లా బంగారమైపోయింది. లక్షాధికారైపోయి ఆ ఊర్లోని అత్యంత గౌరవనీయుల్లోనూ, ప్రముఖుల్లోనూ ఒకడుగా మారిపోయాడు.

సోమయ్య తన దగ్గరకు ఎవరు చందాలకోసం వచ్చినా లేదనకుండా యిచ్చేవాడు. ఆ ఊర్లో అందరూ అతనికి దానకర్ణుడన్న బిరుదిచ్చేశారు.

అతనితో ఎంతో లాభం పొందిన ఆ ఊర్లోని ఓ సాంస్కృతిక సంస్థ అతనికో రోజు గొప్ప సన్మానాన్ని యేర్పాటు చేసింది. వక్తలందరూ ఎక్కడో వున్న తెలంగాణా ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడి ఎంతో కష్టపడి తను పైకొచ్చి మనల్ని కూడా ఎంతో పైకి తీసుకొచ్చాడని...

ఇలాంటి గొప్ప వ్యక్తులూ, దానకర్ణులూ చాలా అరుదుగా కనిపిస్తారని సోమయ్యని పొగిడేశారు. ఆ సభలో అందరూ మాట్లాడాక చివర్లో సోమయ్య ఉరఫ్ సోమేశ్వర్ మాట్లాడుతూ....

"అవును.... నేను ఎవరడిగినా లేదనకుండా చందాలిస్తుంటాను.... ఎవరైనా వచ్చి యేదన్నా మంచి చేస్తానంటే ఎందుకు కాదనాలి? డబ్బు లేని కారణంగా ఓ మంచి పని ఆగిపోకూడదు కదా! అయినా ఈ డబ్బనేది ఎవరిదో ఒకరిదేనని ఎలా చెబుతాం? ఇదంతా ప్రజల డబ్బు.... డబ్బెప్పుడూ ఒకరి దగ్గరే వుండకూడదు... అది ఒకరి దగ్గరి నుంచి మరొకరి దగ్గరకు ప్రవహిస్తూనే వుండాలి" అన్నాడు.

అందరూ పెద్ద పెట్టున చప్పట్లు కొట్టారు.

(వార్త ఆదివారం, 5 జులై 1998)